

# పోటీ

తులసీకృష్ణ

"'పక్కింటి పిల్లలు చూడు, యెంత శుభ్రంగా వుంటారో! వీడో... రోజుకు మూడుసార్లు స్నానాలు చేయించినా మురికి మురికే ... ఛీ! పాడు పిల్లోడు" అన్నది అమ్మ విసుగ్గా.

"పో! వెధవా ...పోయి, కాళ్ళూ, ముఖం కడుక్కో పో" అని కసురుకున్నాడు నాన్న. ఆ 'వెధవ' కప్పటికి పదేళ్లొచ్చినాయి. తను స్నానంచేసి, తల దువ్వుకుని, శుభ్రంగా వుండి

పక్కింటి పిల్లల్తో ఆడుకుంటున్నప్పుడు చూస్తూవున్న అమ్మ, అదివరకూ అట్లానే అన్నది. 'శుభ్రం' అంటే యింకే మిటోనని ఆలోచించినాడు వాడు. తనకేసీ, వాళ్ళకేసీ చూసుకున్నాడు. నిజమే, వాళ్లు తనకంటే బాగున్నారు. ఖరీదైన బట్టతో కుట్టిన అందమైన చొక్కా, నిక్కర్లతో, కాళ్ళకు నిగనిగ మెరిసే చెప్పుల్తో వున్నారు. తన నిక్కరూ, చొక్కా, యెక్కడో వీధిలో పరుచుకున్న వాడిదగ్గర కొనుక్కొచ్చి నాడు నాన్న. పండుగ మర్నాడేననీ, అందరూ పిల్లలకూ, పెద్దలకూ అన్నన్ని బట్టలు తెచ్చుకుంటుంటే, ఆ యేలెడు పిల్లవాడి కింకా బట్టలు తేలేదని అమ్మ గొడవపెడితే, టైలర్‌కు, కుట్టడాని క్కూడా టైంలేదు గనుక కుట్టినవే తెచ్చినాడు. అవీ తనకంటే పెద్ద సైజువి. పెరిగేవాడు కనుక, కొంచెం పెద్దవైతేనే మంచిదనీ డబ్బు దండుగ కాదనీ అన్నాడు. ఆ నిక్కరు నడుము దగ్గర నిల్చోకుండా జారిపోతోంది. నడు ముకు పెట్టుకోడానికి బెల్టుకావాలన్నాడు వాడు. వాళ్ళ నాన్న, నల్లని తోలుబెల్టు కొని తెచ్చినట్లూ, అది పెట్టుకుని అంద రికీ చూపినట్లూ యెన్నోసార్లు వూహించు కున్నాడు. ఒకరాత్రి నిద్రలో, అదే కల గూడా వచ్చింది. అయినా ... నాన్న డబ్బుపెట్టి కొని బెల్టు తేలేదు. డబ్బుతో అవసరం లేకుండా నిక్కరు సమస్య తేల్చేసినాడు.


"వాడి కెట్లాగూ మొలతాడుంది కదా, అదే నిక్కరుపైన వేసుకుంటే సరి పాయె ... మళ్ళీ బెల్టుకు రూపాయ దండగ." అంతటితో వూరుకోలేదు. 'రూపాయపెట్టి తెచ్చినా ఆ ముండా బెల్టు లుండవనీ, వూరికే పుటుక్కున తెగిపోతాయనీ అన్నాడు. బెల్టు తేక పోవడమేగాక, ఆ పిల్లవాడి బెల్టు కలల్ని గూడా పుటుక్కున తెంచేసిన వాడాయెను. నిక్కరు జారినప్పుడల్లా, మొల్తాడు పైనవేసుకోరా వెధవా!' అనరిచేవాడు పైన.

పక్కింటి పిల్లలు శుభ్రంగా వుండ డాని క్కారణం, వాళ్ళకు సరిపడిన అందమైన బట్టల్లో వుండటం అని, ఆలోచిస్తే... అప్పటికే తట్టింది వాడికి. చెప్పులు కూడా లేవు తనకు. వీధిలోకి దిగితే దుమ్ము అవుతుంది మరి! శుభ్రంగా వుండట మెట్లా?

"ఒరే ... మొద్దువెధవా! రవిని చూడు. ప్రతీ సబ్జెక్టులో యెనభై, తొంభై మార్కులు తెచ్చుకున్నాడు. నీకు దేంట్లోనూ ముప్ఫయి దాటలేదు. వాడిని చూసన్నా తెలివి తెచ్చుకో కూడదూ!" అన్నాడు మునిసిపల్ హైస్కూల్ టీచర్ కనకరాజు. అప్ప టికి 'మొద్దు వెధవ'కు పదిహేనేళ్ళు వచ్చినయి. ఎంత మొద్దు వెధవయినా, వాడికి, రవికన్ని మార్కు లెట్లా వస్తు న్నాయో అది తెలుసును. అతను,



యువ




కనకరాజుసార్ కాడికి ప్రైవేటుకు పోతాడు. తను, నెలకు పదిరూపాయ లిచ్చి పోలేదు."

"యూజ్‌లెస్ ఫెలో ... యీ అప్లికేషన్‌లో యిన్ని తప్పులేమిటి ? ఆ పక్క సీటు మూర్తినన్నా చూసి నీట్‌నెస్ నేర్చుకోకూడదూ!" అంటున్నాడు భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ డైరెక్టర్ పద్మనాభం, 'ఫ్యూన్'తో ఫలానా అతన్ని పిలవమని చెప్పి. ఆ 'యూజ్ లెస్ ఫెలో' కప్పటికి ముప్ఫయ్యేళ్లు దాటి నాయి. సమాజం, జీవితం, చాలాభాగం అర్థమైపోయింది. పక్క సీటు మూర్తికి, డైరెక్టర్ పద్మనాభంకి చాలాసార్లు డిన్నర్లు యివ్వగల స్థోమతవుంది. 'ఆ యెదురింటాయన జీతం మూడొందలట ! అయితేనేం వాళ్లెంత దర్జాగా వున్నారో! మనమున్నాం...కడుపుకూ లేక, కట్టుకోనూలేక. పెండ్లాం, పిల్లల్ని సాకలేకపోతే, యెందుకొచ్చిన పిల్లలు? యెందుకొచ్చిన మొగుడు ?'—దాంపత్యం రాపిడికి అప్పటికే చాలా అరిగిపోయిన పెండ్లామంటున్నది.

* * *

నారాయణ చేత్తో యేదో పత్రిక పట్టుకుని కూర్చున్నాడు. అతని కళ్ళు పత్రికను చదవడం లేదు. అందులో కథల పోటీ, ప్రకటన పైనించి కిందిదాకా చూస్తోన్నాయి. ఇతర నిబంధనలన్నీ మామూలుగానే వున్నాయి. ఆ పోటీ కూడా యెప్పుడూ జరిగేదే. అయినా... యెప్పటికప్పుడు ఆ ప్రకటన చూసినప్పుడల్లా యేదో సంచలనం. ఒక్క... చిన్న కథకు రెండువేల రూపాయలు !

రెండువేల రూపాయలు యెన్ని వందల చిన్న అవసరాల్ని (తన పాలిటికి బ్రహ్మాండమైన) తీరుస్తాయో! ఆ రెండు వేలరూపాయల బహుమతొచ్చే కథ రాయగలిగితే ! తనిప్పుడు మంచి కథ రాయడంకన్నా, ఆ బహుమతొచ్చే కథ రాయడం ముఖ్యమన్నది, పదే పదే మనస్సును కొరుకుతున్నది. కానీ రాయలేడు. రెండువేలరూపాయల ఖరీదుచేసే కథ, లేకపోతే అంతకన్నా విలువైన కథ రాయగలడేమో కానీ, ఆ రెండు వేల బహుమతొచ్చే కథ రాయలేడు. తన అనుభవంలో, అవగాహనలో యెక్కడా అందని, ఆ కథను వెతికి పట్టుకోలేడు.

చిన్నప్పుడు ... పక్కింటి పిల్లలకు తెచ్చినట్లు మనం మన పిల్లలకు బట్టలు తేలేమని తెలిసినా, అది దాచిపెట్టుకుని, తనను పక్కింటి పిల్లల్తో పోటీకి తోసినారు తల్లీ దండ్రి ! ఈ కథల పోటీ వాళ్లు, యెందరు పోటీలో పాల్గొన్నా, యెవరెంత మంచికథ రాసినా, తమకు నచ్చిన కథకుమాత్రమే బహుమతిస్తామన్న సంగతి అడుగు నుంచేసి, డబ్బు కర్రవీపునపెట్టి 'పోటీ'లోకి తోస్తున్నారు. ఎంత గొప్ప బహుమతైతే, అంత పొడుగాటి, బలమైన కర్ర అన్నమాట. తన దగ్గరికి ప్రైవేటుకు రాలేదన్న అక్కసుతో, ఆ 'రవి'తో పోటీకి రమ్మని సవాల్ చేసినాడు కనకరాజు టీచర్. అట్లానే డైరెక్టర్ పద్మనాభం... పెండ్లాం...అంతా పోటీ పెట్టి పొడిచేవాళ్లే ! నిజానికి ... పోటీ బాధ పోటీల్లో పాల్గొనడంలో లేదు, పోటీలో పాల్గొనలేకపోవడంలో వుందేమో ! ఆ బాధ చెప్పుకుందామని యీ రచనని ఆధారంచేసుకుంటే యిక్కడా పోటీ బాధ. తనకులేని అవకాశాలన్నిటిని యెత్తిచూపుతూ, వున్న ఒక్క అవకాశాన్ని నొక్కిపెడుతూ... యిక్కడా పోటీ ! తనకున్న అవకాశాల్నీ, అభిరుచుల్నీ, యెవరూ లెక్కలోకి తీసుకోడంలేదు. నారాయణకు నవ్వొచ్చింది. నవ్వులోనే కళ్లు చెమ్మగిల్లినాయి. కథల పోటీ ప్రకటన కాగితాన్ని, నలిపి పక్కకు విసిరికొట్టి కళ్ళు మూసుకున్నాడు. అయినా... కథల పోటీ ప్రకటన రెండంకె, మూడుసున్నాలతో చుట్టూ తిరుగుతూ నారాయణ మెదడును నలుపుతూనేవుంది.

